సంపుటి - 7 డిసెంబర్ - 2023 సంచిక - 04

# జీవస్వరం

ఆధ్యాత్మిక మాస పత్రిక


తండ్రి గారి సందేశం.............................................3

క్రిస్మస్ పండుగకు పరిశుద్ధ గ్రంథ వాక్యాలతో సిద్ధపాటు .........5

పరదైసు ..................................................9

పావన పసిబిడ్డల ఉత్సవం ....................................9

బైబిల్ దర్శనం...............................................13

శుభవచనం బైబిల్ క్విజ్.......................................15

ఇంద్రధనుస్సు.................................................17


ఏంజెల్స్ కార్నర్................................................18

యువ స్పందన ...............................................19

బైబిల్ దృశ్యమాలిక...........................................21

శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు..........................23











**ముద్రణానుమతి**

**బిషప్ ప్రిన్స్ అంతోని గారు**

**ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు**



**సంపాదక వర్గం**

ఫాదర్ సిజో — ఫాదర్ ఎబిన్

Mr. M. సత్యం — సిస్టర్ క్రిస్టీన CMC

Mrs. K. శ్రీలత — Mr. J. లూర్దు స్వామి



**జీవస్వరం**
**బిషప్స్ హౌస్**
**మంచిర్యాల- 504 208**
**మంచిర్యాల జిల్లా**
**తెలంగాణ**

**Cell: 09398764408**

**Email ID - jeevaswarammagazineadb@gmail.com**

**Jeevaswaram**
**Bishop's House**
Mancherial - 504 208
Mancherial Dist
Telangana State

**మనకొక శిశువు జన్మించెను.**
**మనమొక కుమారుని బడసితిమి. అతడు**
**రాజ్య భారము వహించును.**
**"ఆశ్చర్యకరుడైన సలహాదారు, బలాఢ్యుడైన**
**దేవుడు, శాశ్వతుడైన జనకుడు,**
**శాంతి కరుడైన రాజు" అని అతడికి**
**పేరిడుదురు (యెషయా 9,6)**

సెప్టెంబర్ నెల
శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు

మొదటి బహుమతి
ఆర్. జయ, ఆదిలాబాద్
రెండవ బహుమతి
ఆర్. రజిత, మంచిర్యాల
మూడవ బహుమతి
వై. మేరి, జెండావెంకటాపూర్

బహుమతులు విచారణ గురువుల ద్వారా
అందజేయబడుతాయి

సెప్టెంబర్ నెల
ఇంద్రధనుస్సు విజేతలు

మొదటి బహుమతి
ఎ. హరిప్రియ, రేపల్లివాడ
రెండవ బహుమతి
కె. రిత్విక, జన్నారం
మూడవ బహుమతి
యు. శ్రేష్ఠ, ఇంద్రవెల్లి

బహుమతులు విచారణ గురువుల ద్వారా
అందజేయబడుతాయి



# తండ్రిగారి సందేశం....

## రక్షకుని వెదకి, కనుగొని ఆరాధించిన జ్ఞానులు

**(మత్తయి 2,1-13)**

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

ప్రియ సహోదరీ సహోదరులారా, మన జీవితంలో అనేకమైన వాటిని మనం కావాలనుకుంటాము. గొప్ప పేరు, భాగ్యము, సంపద, సంతోషము అనేవి వాటిలో ఉంటాయి. కానీ, యేసు ప్రభువు మాటల్లో "అవసరమైనది ఒక్కటే" (లూకా 10,42), అది ప్రభువును వెదకటం. "దేవా, నా దేవుడవు నీవే, వేకువనే నిన్ను వెదకుదును" అని దావీదు అన్నాడు (కీర్తన 63,1). "మీ ప్రభువైన దేవుని కొరకు వెదకుదురు. కాని పూర్ణ హృదయముతో వెదకుదురేని ఆయనను కనుగొందురు'' అని మోషే యిస్రాయేలీయులను ప్రోత్సహించాడు (ద్వితీ 4,29). యేసు ప్రభు జన్మదిన మహోత్సవం కొరకు సిద్ధపడుతున్న మనం పూర్ణాత్మతోను, పూర్ణ హృదయముతోను దేవునిని ఆరాధింపవలెనని నిశ్చయించుకుని (2 రాజుల దినచర్య 15,12) ఆయన కొరకు వెదకి, కనుగొని ఆరాధించిన జ్ఞానుల గురించి ధ్యానిద్దాం.

"హేరోదు రాజు పరిపాలనా కాలమున యూదయా సీమయందలి యేసు జన్మించెను. అపుడు జ్ఞానులు తూర్పుదిక్కు నుండి యెరూషలేమునకు వచ్చి, 'యూదుల రాజుగా జన్మించిన శిశువెక్కడ? ఆయన నక్షత్రమును తూర్పు దిక్కునచూచి వేము ఆరాధింపవచ్చితిమి' అని అనిరి" (మత్తయి 2,1-2). ఈ మనుష్యులు ''జ్ఞానులు'' అని సువార్తలో వ్రాయబడింది. తూర్పు దేశపు "జ్ఞానులు" అని పిలువబడ్డారు కాబట్టి వారు ఏ దేశపువారనేది నిశ్చయంగా తెలియదు. యథార్థంగా వారు ఏ దేశము నుండి ప్రయాణమయ్యారో మనకు తెలియదు. జ్ఞానులను గూర్చిన ఒక విషయం మాత్రం అర్థమవుతుంది. అదేమిటంటే వారు యూదులు కారు. యేసు ప్రభువు గురించి హేరోదు వద్ద ప్రస్తావించినపుడు "మా రాజు" అని వారు అనలేదు, "యూదుల రాజు" అని వారు పలికారు. బాలుడైన యేసు దేవాలయానికి కొనిపోబడినప్పుడు వృద్ధుడైన సిమియోను ఇలా అన్నాడు: "ప్రజలందరి ఎదుట నీవు ఏర్పరచిన రక్షణను నేను కనులారగాంచితిని. అది అన్యులకు మార్గదర్శకమగు వెలుగు; నీ ప్రజలగు యిస్రాయేలీయులకు మహిమను చేకూర్చు వెలుగు" అని అన్నాడు (లూకా 2,32). యేసు ప్రభు జననం యూదులకు మాత్రమే కాక ప్రపంచానికి అంతటికి సంబందించినది అని ఈ సువార్త భాగం ద్వారా అర్థమవుతుంది. యేసు ప్రభు కేవలం యిస్రాయేలీయులకు రక్షకుడు కాదు; ఆయన "లోక రక్షకుడు" (యోహాను 4,42).

జ్ఞానులు "యూదుల రాజును" వెదకడంలో దృఢ నిశ్చయం కలిగి ఉన్నారు. నిజమైన జ్ఞానం దశాబ్దల తరబడి చేసిన పరిశోధనల్లో గాని, ప్రకృతి సిద్ధమైన లోకాన్ని తెలుసుకోవడంలో లేదని వారు

గ్రహించారు. ఆ జ్ఞానులు అంత దీర్ఘమైన, కఠినమైన ప్రయాణం ఎందుకు చేశారు? తమ సామాగ్రిని తీసుకుని వర్తకులుగా వారు రాలేదు. యాత్రికులుగా వారు రాలేదు. రాజైన హేరోదుతో సత్సంబంధాలు నెలకొల్పుకొనడానికి రాయబారులుగా వారు రాలేదు. వారు యెరూషలేమునకు వచ్చి, "యూదుల రాజుగా జన్మించిన శిశువెక్కడ?" అని అడిగారు (మత్తయి 2,2). యేసు ప్రభువును కనుగొనాలి, పూజించాలని ఒకే ఒక ఉద్దేశంతో వారు వచ్చారు. కాబట్టి యేసు ప్రభు కేవలం "యూదుల రాజు" మాత్రమే కాదు; ఆయన ఈ జ్ఞానులకు కూడా రాజే. ఆ రాజు ముందర సాగిలపడడానికి వారు వందల మైళ్లు పయనించారు. యేసును వెదకడంలో అవసరమయ్యే ఏ త్యాగమైనా చేయటానికి వారు సిద్ధపడ్డారు. "దేవుని చేరవచ్చు ప్రతివ్యక్తి, దేవుడు ఉన్నాడనియు, తన కొరకై వెదకువారికి ఆయన ప్రతిఫలమిచ్చుననియు విశ్వసింపవలెను (హెబ్రీ 11,6) అని పరిశుద్ధ గ్రంథం నేర్పిస్తుంది.

ఆయన నక్షత్రమును తూర్పు దిక్కున చూసి వచ్చాము అని వారన్న మాటలలో వారు నేరుగా దేవునిచే నడిపింపబడ్డారు అని అర్థమవుతుంది. క్రీస్తు జ్ఞానమును గూర్చిన సందేహం జ్ఞానులు ఎరుగునట్లు దేవుడు చేశాడు. మెస్సీయాను ఎలా కనుగొనాలో దేవుడు వారికి నక్షత్రం ద్వారా సందేశాన్ని అందించాడు. తరువాత, దేవుడు జ్ఞానులతో కలలో మాట్లాడాడు (మత్తయి 2,12). యేసును మనం కనుగొనాలంటే, "దేవుని నడిపింపును" గైకొనడానికి మనం యిష్టపడాలి. దేవుని నడిపింపును మనం అంగీకరించి, ఆయనను వెంబడించుటకు సిద్ధంగా ఉండాలి. జ్ఞానులు యేసు ప్రభువును వెదకటంలో వెనుకాడలేదు.

జ్ఞానులు తమ ఇండ్లను విడిచిపెట్టినప్పుడు వారి చివరి గమ్యం ఎక్కడో వారెరుగరు. నక్షత్రాన్ని వెంబడించాలి, రక్షకుని కనుగొనాలి అన్నదే వారి ఆశయం. వారు యెరూషలేమునకు వచ్చినప్పుడు, ఆ తరువాత ఎక్కడికి వెళ్లాలనే విషయంలో దిక్కుతోచలేదు. వారు హేరోదు రాజును సమీపించారు. "యూదుల రాజు ఎక్కడ జన్మిస్తాడు అనే ప్రశ్నకు "యూదయ సీమయందలి బేత్లేహేమునందు" అని ప్రధానార్చకులు, ధర్మశాస్త్ర బోధకులు సమాధానమిచ్చారు. "యూదయ సీమయందలి బెత్లేహేమా! నీవు యూదయా పాలకులలో ఎంత మాత్రమును అల్పమైనదానవు కావు. ఏలయన నా యిస్రాయేలు ప్రజలను పాలించు నాయకుడు నీలో నుండి వచ్చును" (మత్తయి 2,5-6).

రాజు ప్రశ్నకు తగిన జవాబు కనుగొనడానికి ప్రధానార్చకులు, ధర్మశాస్త్ర బోధకులు లేఖనాలకు వెళ్లవలసి వచ్చింది (మీకా 5,2). యేసు ప్రభువును వెదకి కనుగొనాలంటే మనం తప్పక ఆయన వాక్యము వద్దకు వచ్చి తీరాలి. లేఖనాలను గూర్చి ప్రభువు మాట్లాడుతూ ఇలా అన్నాడు "నిత్యజీవము ఇచ్చునని మీరు భావించు లేఖనములను పరిశీలింపుడు. అవియే నన్ను గూర్చి సాక్ష్యమిచ్చుచున్నవి" (యోహాను 5,39). "ఆయన మీ హృదయములపై ముద్రించిన వాక్కును సాత్వికముగ ఆలకింపుడు. అది మిమ్ము రక్షించు శక్తిగలది" అని యాకోబు బోధించాడు (యాకోబు 1,21). "బాల్యము నుండి నీవు పవిత్ర లేఖనములను ఎరిగియుంటివి. అవి నీ జ్ఞానమునకు మూలము. ఆ జ్ఞానమే క్రీస్తు యేసునందు విశ్వాసము ద్వారా రక్షణకు చేర్చును" అని పౌలు పేర్కొన్నాడు (2 తిమోతీ 3,15). జ్ఞానులను నడిపించడానికి నక్షత్రం అవసరమైంది. కాని మనలను నడిపించేది పవిత్ర గ్రంథం. దేవుని వాక్యం మన "పాదములకు దీపము, త్రోవకు వెలుగు"

అని కీర్తనకారుడు వర్ణించాడు (కీర్తన 119,105). ఆ జ్ఞానులవలె మనం కూడా దేవుని వాక్యం ద్వారా నడిపింపబడాలి. ప్రభువు వద్దకు వెళ్లవలసిన మార్గాన్ని క్రొత్త నిబంధన మనకు బయలుపరచుతుంది. మనం యేసు ప్రభు నందు విశ్వసించాలి (యోహాను 3,16). మనం మన పాపముల విషయమై మారుమనస్సు పొందాలి (లూకా 13,3). యేసునందలి మన విశ్వాసాన్ని ఒప్పుకోవాలి (మత్తయి 10,32), బప్తిస్మము పొందాలి (మార్కు 16,16).

**జ్ఞానులు యేసును కనుగొన్నారు (మత్తయి 2,7-11)**

యేసు ప్రభు ఎక్కడ జన్మించాడో అని తెలుసుకున్న జ్ఞానులు యెరూషలేము నుండి బయలుదేరారు. నక్షత్రం వారికి తిరిగి ప్రత్యక్షమయ్యింది. ''వారు నక్షత్రమును చూచినప్పుడెంతో ఆనందించిరి" (మత్తయి 2,10). సరియైన మార్గంలో తామున్నట్టు వారు గ్రహించారు. వారు చూసిన నక్షత్రము ఆ శిశువు ఉండిన చోటికి మీదుగా వచ్చి నిలుచు వరకు వారికి ముందుగా నడిచింది. "అంతట వారు ఆ గృహమున ప్రవేశించి, తల్లి మరియమ్మతోనున్న బిడ్డను చూచి, సాష్టాంగపడి ఆరాధించిరి" (మత్తయి 2,11). జ్ఞానులు యేసును కనుగొన్నారు. రక్షకుని కనుగొన్న తరువాత పొందే ఆనందం కన్నా గొప్ప ఆనందం జీవితంలో ఏది లేదు. సరియైన దృక్పథముతో జ్ఞానులు యేసును వెదకినందున వారాయనను కనుగొనునట్లు దేవుడు శ్రద్ధ వహించాడు. అంత దీర్ఘకాలంగా వారు వెదకుతూ వచ్చిన ప్రభువుని వారు కనుగొనినప్పుడు కలిగిన వారి ఆనందానికి అవధులు లేకపోయి ఉండవచ్చు. మరియమ్మ చేతులలో ఉన్న శిశువును వారు చూచినప్పుడు - వారి ప్రయాణంలోని కష్టాల మీదగాని, వారు చేసిన ఏ త్యాగం మీద గాని మనస్సు పోయి ఉండకపోవచ్చు. వారి తృష్ణ, వారి అన్వేషణ విజయవంతంగా ముగింపబడిందనే ఆనందంతో వారి హృదయాలు తప్పక నిండి ఉంటాయి.

సరియైన మార్గంలో, సరియైన దృక్పథంతో మనం ప్రభువును వెదకినట్లయితే, ఆయనను తగిన రీతిలో కనుగొనడానికి ఆయనే మనకు సహాయపడతాడు. "మోషే ధర్మశాస్త్రమునందును, ప్రవక్తల ప్రవచనములందును చెప్పబడినవానిని మేము కనుగొంటిమి. ఆయన యోసేపు కుమారుడును, నజరేతు నివాసియునగు యేసు" అని ఫిలిప్పువలె మనం ప్రకటించగలం (యోహాను 1,45). "మీరు ఆయనను చూడలేకపోయినను ఆయనను ప్రేమించుచున్నారు. ఇప్పుడు ఆయనను కన్నులారా చూడకయే విశ్వసించుచున్నారు. వర్ణనాతీతమగు మహానందమును మీరు అనుభవించుచున్నారు" అని పేతురు మన గురించి చెప్తున్నారు (1 పేతురు 1,8).

**జ్ఞానులు యేసును పూజించారు (మత్తయి 2,11)**

జ్ఞానులు యేసును కనుగొని ఆయనను పూజించారు. వారు "తమ సంచులను విప్పి ఆ శిశువునకు బంగారము, సాంబ్రాణి, పరిమళ ద్రవ్యములను కానుకలుగా సమర్పించిరి'' (మత్తయి 2,11). బంగారము రాజునకు సంబందించిన కానుక. సాంబ్రాణి యాజకునికి సంబంధించిన బహుమానం. పరిమళద్రవ్యము మృత దేహాన్ని సమాధికి సిద్ధపరడంలో ఉపయోగిస్తారు (యోహాను 19,39) కనుక మన పాపముల కొరకు సిలువలో మరణించే రక్షకునికి బహుమానం. యేసు ప్రభువు- రాజు, యాజకుడు, రక్షకుడు.

మనము బంగారము, సాంబ్రాణి, పరిమళద్రవ్యము సమర్పించనవసము లేదు. మనకు కలిగిన దానిలో శ్రేష్టమైనది ఆయనకు

సమర్పించుదాము. యేసు ప్రభువుకు ఏమి సమర్పించాలి అని పౌలు గారు బోధిస్తున్నారు. "కాబట్టి సోదరులారా! పరిశుద్ధమును దేవునికి ప్రీతికరమును అయిన సజీవయాగముగ మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని కనికరముబట్టి మిమ్ము బ్రతిమాలుకొనుచున్నాను'' అని పౌలు గారు నేర్పిస్తున్నారు (రోమా 12,1). జ్ఞానులు యేసును కనిగొనినప్పుడు వారు ఆయనను పూజించారు. తమ కానుకలు ఆయనకు సమర్పించారు. మరి మనము మన జీవితాలను యేసు ప్రభువుకు సమర్పించడానికి సిద్ధమా?

ఆ జ్ఞానులను గూర్చి మనకు అనేక సంగతులు తెలియవు. యెరూషలేమునకు రాక ముందు వారిని గూర్చి మనకు అంతగా తెలియదు. వారు తమ స్వదేశానికి తిరిగి వెళ్లిన తరువాత కూడా మనకు ఏ విషయమూ తెలియదు. కాని, దేవుని రక్షణ ప్రణాళికలోని ముఖ్యమైన ఘట్టంలో వారు కన్పించి అదృశ్యమౌతారు. అయినా, వారి గురించి ఒక విషయం మాత్రం మనకు ఖచ్చితంగా తెలుసు. ప్రభువును వెదకి కనుగొనడంలో వారి జీవితాలు ధన్యమయ్యాయి. ప్రభువును కనుగొన్నందుకు వారి ఆనందానికి అవధులు లేవు! వారికి ముందుగా వచ్చిన గొర్రెల కాపరులవలె, బెత్లెహేము నుండి వారు వెడలిపోయినపుడు, వారు కనుగొనిన ఆ బాలుడైన రాజును గూర్చి వారిని కలసికొన్న వారికందరికి ప్రచారము చేసియుండవచ్చు.

ఈ సువార్త భాగం మూడు రకాలైన మనుష్యుల మధ్య తారతమ్యాన్ని తెలుపుతుంది. జ్ఞానులు క్రీస్తును పూజించడానికి వారు ఆయనను వెదకుతూ వచ్చారు. హేరోదు క్రీస్తును చంప వెదికాడు. యూదా మతనాయకులు యేసు వారికి కొన్ని మైళ్లదూరములో ఉన్నప్పటికి, వారు ఆయనను కనుగొనడానికి ప్రయత్నించలేదు. మరి మనం ఏ రకానికి చెందిన వారము?

ప్రియ సహోదరీ సహోదరులారా, రక్షకుని మనం వెదకి కనుగొన్నట్లయితే, మనం ఊహించగలిగినదానంతటి కంటే అధికంగా మన జీవితం దీవించబడుతుంది. కాబట్టి, యేసు ప్రభువుకు మనం మన జీవితాలను సమర్పించుకుందాం. మనం పొందుకున్న ఈ ఆనందాన్ని గొఱ్ఱెల కాపరుల వలె అందరితో పంచుకుందాం. యేసు ప్రభు లోక రక్షకుడని ప్రకటిద్దాం. మీకందరికి యేసు ప్రభు జన్మదిన మహోత్సవ శుభాకాంక్షలు.

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు

> **"ఇదిగో నేను**
> **ప్రభువు**
> **దాసిరాలను**
> **నీ మాట చొప్పున**
> **నాకు**
> **జరుగును గాక!"**
> **అనెను.**
> **(లూకా 1,38)**



# క్రిస్మస్ పండుగకు పరిశుద్ధ గ్రంథ వాక్యాలతో సిద్ధపాటు

**25 వచనాలను నేర్చుకుందాం.......**

**డిశంబర్ 1, 2018**

తదుపరి ఆరవ మాసమున దేవుడు గబ్రియేలు దూతను గలిలీయ సీమ యందలి నజరేతు నగరమునకు పంపెను. ఆ దేవదూత దావీదు వంశస్థుడగు యోసేపునకు ప్రధానము చేయబడిన కన్యక యొద్దకు పంపబడెను. ఆమె పేరు మరియమ్మ. (లూకా 1,26–27)

**డిశంబర్ 2, 2018**

దేవదూత "మరియమ్మా! భయపడకుము. నీవు దేవుని అనుగ్రహమును పొందియున్నావు". (లూకా 1,30)

**డిశంబర్ 3, 2018**

"ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కనెదవు. ఆ శిశువునకు 'యేసు' అని పేరు పెట్టుము". (లూకా 1,31)

**డిశంబర్ 4, 2018**

ఆయన మహనీయుడై, మహోన్నతుని కుమారుడని పిలువబడును. ప్రభువగు దేవుడు, తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకు ఇచ్చును. (లూకా 1,32)

**డిశంబర్ 5, 2018**

అంతట మరియమ్మ "ఇదిగో నేను ప్రభువు దాసిరాలను నీ మాట చొప్పున నాకు జరుగును గాక!" అనెను. (లూకా 1,38)

**డిశంబర్ 6, 2018**

తన సామ్రాజ్యమందు జనాభా లెక్కలు సేకరింపవలెనని సీజరు అగస్తు చక్రవర్తి ప్రకటించి అధికారులకు ఆజ్ఞ ఇచ్చెను. (లూకా 2,1)

**డిశంబర్ 7, 2018**

అందులో పేర్లు వ్రాయించు కొనుటకు ప్రజలందరు తమ తమ పట్టణములకు వెళ్లిరి. (లూకా 2,3)

**డిశంబర్ 8, 2018**

యోసేపు, దావీదు వంశస్థుడైనందున గలిలీయ సీమలో ఉన్న దావీదు పట్టణమగు బేత్లెహేమునకు జనాభా లెక్కలలో తమ పేర్లు చేర్పించుకొనుటకై వెళ్లెను. (లూకా 2,4–5)

**డిశంబర్ 9, 2018**

వారచట ఉన్నపుడు మరియమ్మకు ప్రసవ కాలము సమీపించెను. మరియమ్మ తన తొలిచూలు కుమారుని కని, పొత్తిగుడ్డలలో చుట్టి పశువుల తొట్టిలో పరుండ బెట్టెను. ఏలయన వారికి సత్రములో చోటు లేకుండెను. (లూకా 2,6-7)

**డిశంబర్ 10, 2018**

ఆ ప్రాంతమున గొఱ్ఱెల కాపరుటు రాత్రివేళ పొలములో గొఱ్ఱెల మందలను కాయుచుండిరి. (లూకా 2,8)

**డిశంబర్ 11, 2018**

దేవదూత వారెదుట ప్రత్యక్షమాయెను. ప్రభు మహిమ వారిపై ప్రకాశింపగా వారు మిక్కిలి భయభ్రాంతులైరి. (లూకా 2,9)

**డిశంబర్ 12, 2018**

దేవదూత వారితో ఇట్లనెను. "మీరు భయపడవలదు. సమస్త జనులకు పరమానందము కలిగించు శుభ సమాచారమును మీకు వినిపించెదను. (లూకా 2,10)

**డిశంబర్ 13, 2018**

"నేడు దావీదు నగరమున మీకు ఒక రక్షకుడు పుట్టెను. ఆయన క్రీస్తు, ప్రభువు". (లూకా 2, 11)

**డిశంబర్ 14, 2018**

"శిశువు పొత్తిగుడ్డలలో చుట్టబడి పశువుల తొట్టిలో పరుండబెట్టబడి ఉండుట మీరు చూచెదరు. ఇదే మీకు ఆనవాలు" అనెను. (లూకా 2,12)

**డిశంబర్ 15, 2018**

'మహోన్నత స్థలములో సర్వేశ్వరునికి మహిమ, భూలోకమున ఆయన అనుగ్రహమునకు పాత్రులగు వారికి శాంతి కలుగు గాక!' (లూకా 2,14)

**డిశంబర్ 16, 2018**

వారు వెంటనే వెళ్లి మరియమ్మను, యోసేపును, తొట్టిలో పరుండియున్న శిశువును కనుగొనిరి. (లూకా 2,16)

**డిశంబర్ 17, 2018**

"అతడు ఏలియా ఆత్మయును, శక్తియును కలవాడై ప్రభువునకు ముందుగా నడచును. తల్లి దండ్రులను, బిడ్డలను సమాధాన పరచును. అవిధేయులను నీతిమంతుల మార్గమునకు మరల్చును. ప్రభువు సన్నద్ధులైన ప్రజలను సమాయత్తపరచును" అనెను. (లూకా 1,17)

**డిశంబర్ 18, 2018**

మనకొక శిశువు జన్మించెను. మనమొక కుమారుని బడసితిమి. అతడు రాజ్య భారము వహించును. "ఆశ్చర్యకరుడైన సలహాదారు, బలాఢ్యుడైన దేవుడు, శాశ్వతుడైన జనకుడు, శాంతి కరుడైన రాజు" అని అతడికి పేరిడుదురు. (యెషయా 9,6)

**డిశంబర్ 19, 2018**

హేరోదు రాజు పరిపాలనా కాలమున యూదియా సీమయందలి బేత్లెహేము నందు యేసు జన్మించెను. అప్పుడు జ్ఞానులు తూర్పు దిక్కు నుండి యెరుషలేమునకు వచ్చిరి (మత్తయి 2,1)

**డిశంబర్ 20, 2018**

"యూదుల రాజుగా జన్మించిన శిశువెక్కడ? ఆయన నక్షత్రమును తూర్పు దిక్కున చూచి మేము ఆరాధింప వచ్చితిమి" అని అనిరి (మత్తయి 2,2)

**డిశంబర్ 21, 2018**

అంతట వారు ఆ గృహమున ప్రవేశించి, తల్లి మరియ్మతో నున్న బిడ్డను చూచి సాష్టాంగపడి ఆరాధించిరి.

**డిశంబర్ 22, 2018**

పిదప తమ సంచులను విప్పి ఆ శిశువునకు బంగారము, సాంబ్రాణి, పరిమళ ద్రవ్యములను కానుకలుగా సమర్పించిరి. (మత్తయి 2,11)

**డిశంబర్ 23, 2018**


దేవుడు లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని ప్రసాదించెను. ఆయనను విశ్వసించు ప్రతివాడును నాశము చెందక నిత్య జీవమును పొందుటకై అట్లు చేసెను. (యోహాను 3,16)

**డిశంబర్ 24, 2018**

"ఇదిగో కన్య గర్భము ధరించి ఒక కుమారుని కనును ఆయనను 'ఇమ్మానువేలు' అని పిలిచెదరు" అని ప్రవక్తతో ప్రభువు పలకినది నెరవేరునట్లు ఇదంతయు సంభవించెను. "ఇమ్మానువేలు" అనగా "దేవుడు మనతో ఉన్నాడు" అని అర్థము. (మత్తయి 1,22-23)

**డిశంబర్ 25, 2018**

ఆ వాక్కు మానవుడై మనమధ్య నివసించెను. మేము కృపా సత్యములతో నిండిన ఆయన మహిమను చూచితిమి. అది తండ్రి యొద్ద నుండి వచ్చిన ఏకైక కుమారుని మహిమ. (యోహాను 1,14)




# పరదైసు (2వ మాట)

**గత సంచిక తరువాయి భాగం**

నామము అంటే కేవలం పేరుకాదు, లేక శబ్దం కాదు. వ్యక్తి. యేసు అనే వ్యక్తిని ఎరగడం. తెలుసుకోవడం. అందేకే గెత్సెమనిలో యేసు ప్రార్థిస్తూ, "నీ అద్వితీయ కుమారుని ఎరుగుటయే నిత్యజీవము" అన్నారు. యేసు క్రీస్తుతో ఎరికైతే సాన్నిహిత్య సంబంధం ఉంటుందో వారిదే పరలోక రాజ్యం. ఇక్కడ మనకు ఆయనను ఎరగడానికి చాన్స్ ఉంది. ఇక్కడ మనం ఆయనతో అంటి అంటునట్టు ఉన్నామనుకోండి, అక్కడ ఆయన కూడ "మీరు ఎవరో నాకు తెలియదు" అంటారు. యేసు ప్రభు ఇస్తున్న ఈ ఖచ్చితమైన వాగ్దానం చాలా ప్రాముఖ్యమైనది. ఆయన రక్షకుడు కాకపోతే అంత ఖచ్చితంగా మాట్లాడలేరు. ఇది చదువుతున్న చాలా మందికి ఒక అనుమానం రావచ్చు. "నేను నిజంగా రక్షింప బడ్డానా?" అని. కేవలం మనం బ్యాప్టిసం తీసుకున్నంత మాత్రాన మనం రక్షింపబడినట్టు కాదు. దొంగ బ్యాప్టిసం తీసుకోలేదు. బ్యాప్టిసం తీసుకున్నంత మాత్రాన మనం రక్షింపబడినట్టు కాదు. బ్యాప్టిసం కేవలం భూలోకం కోసం కాని పరలోకం కోసం కాదు. రక్షణ పరలోకం కోసం అని దయచేసి అర్థం చేసుకోండి. క్షణ మీకుంటే ఆ రక్షణ నాకుందని ఈ భూలోకానికి చెప్పడం కోసం శారీరకమైన బ్యాప్టిసం తీసుకుంటున్నాము. యేసుని వద్ద వచ్చిన వారికి ఒక ఖచ్చితమైన నమ్మకముంటుంది. నాకెలా తెలుసు నా పాపాలు క్షమించబడ్డాయని? నాకు యేసుప్రభులో ఉన్న విశ్వాసం ద్వారా నా పాపాలు క్షమించబడ్డాయో

లేదో మనం తెల్సుకోగలం. బైబిల్ ఏది చెప్తుతుందో అది దేవుడు చెప్పినట్లే. దేవుడు ఏం చెప్పాడో అది వంద శాతం నిజం. యేసు ప్రభులో ఉన్న ఒక గుణం ఏమిటంటే మనం ఎంతటి పాపాత్ములమైన, దుర్మార్గులమైన, మనం ఎలాంటి వారమైన మనల్ని స్వీకరించడానికి ఆయన సర్వదా సిద్ధమని ఈ రెండవ మాట ద్వారా మనం గ్రహించవచ్చును. "వాడు దొంగ కదా, ఎన్ని నేరాలు చేసి ఉండవచ్చు, అంతటి ఘోరమైన వాన్ని ఒక్కమాట అడిగినంత మాత్రాన ఆయనకు పరలోక ప్రాప్తిని అనుగ్రహించాడు" అని మనం నెత్తి నోరు బాదుకుంటారు. కాని హెబ్రి పత్రికలో వ్రాయబడిన ప్రకారం "సమయోచితమైన ఆయన సహాయం కోసం మనం ఎప్పుడైన ఆయన కృపా సింహాసనం దగ్గరకు పరుగెత్తవచ్చు. "అందుకే బైబిల్ చెప్తుంది". అదే "అనుకూల సమయం, ఇదే రక్షణ దినం". ప్రభువు గొప్పతనం ఏమిటంటే నన్ను నన్నుగా అంగీక రిస్తాడాయన. దొంగ నేరాలన్నింటిని ఒక్క మాటతో కొట్టేశాడు. కేవలం ఒకే ఒక్కమాట. అంతటి కరుడు కట్టిన నేరస్థున్ని "నువ్వేంటి" నీ "బ్యాగ్రౌండ్" ఏంటి అని అడగలేదాయన. వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీని కూడ ఆయన వివరాలు ఏమి అడగలేదు. వివరాలు అడిగేది మనుష్యులు. మనలో ఏంత రహస్య పాపమున్నా, ఎంత ఘోర పాపమున్న ఉన్న పళంగా ఆయన వద్ద మోకరిల్లితే ఆయన మనల్ని అక్కున చేర్చుకుంటాడు. మనల్ని మనం అంగీకరిస్తాడు. ఆ రోజున ఆ దొంగతో అదే జరిగింది. వాస్తవంగా బైబిల్ ప్రకారం యేసు ప్రభువు చాల తక్కువ మాట్లాడారు, చాల క్లుప్తంగా మాట్లాడతారు. అంతే కాకుండా ఆ మాటలు చాలా బరువుగా ఉంటాయి. ''నిన్ను పరలోకానికి పంపిస్తాను'' అని అనలేదాయన. "నీ పాపాలు క్షమించబడ్డాయి" అని అనలేదాయన. అన్ని కలిపి ఆ దొంగతో ఒక్క మాటతో చెప్పారాయన. "నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువు. ఇందులో ఎన్ని మాటలున్నాయో చూడండి. అంత అర్థముందో చూడండి. అసలు దొంగ ఏమి అడిగాడు? "నువ్వు నీ రాజ్యంతో వచ్చినప్పుడు నన్ను జ్ఞాపకం చేసుకో" అని. ఆయన మళ్ళీ తిరిగి వస్తాడని ఆ దొంగకు తెల్సియుండాలి. అంటే ఆయన బోధలు, ఆయన అద్భుతాలు అన్ని ఆ దొంగకు తెలిసి ఉండాలి. కాని ప్రభువు అప్పుడే, అనగా నేడే నీవు నాతో కూడ పరదైసులో ఉంటావు. మనస్ఫూర్తిగా మనల్ని మనం సంపూర్ణంగా ఆయనకు సమర్పించుకున్న రోజే మనం రక్షింపబడతాము. రెండవదిగా ఆయన మాటలో ఉన్న గొప్పతనం ఏమిటంటే "నాతో కూడ పరలోకంలో ఉంటావు" ఎంత ఆదరణ అది. ఈ మాట ద్వారా ఒక విశ్వాసి తెల్సుకోవలసింది ఏమిటంటే క్రైస్తవుడు మరణాన్ని ఎందుకు ఆహ్వానిస్తాడు, ఏందుకు సంతోషింగా ఎదుర్కుంటాడు అంటే మరుక్షణం ప్రభువుతో ఉంటాడు. ప్రభువుతో మనకు ఇక్కడ లేని సహవాసం మరణం తరువాత మనకు వెంటనే దొరుకుతుంది. పరలోకమంటే ప్రభువుతో కల్సి మనం జీవించడం. ఆయనను అనుభవించడం. ఈ లోకంలో ఆయన నీవు దొరికితే పరలోకంలో నువ్వు వద్దన్నా ఆయన నీతోనే ఉంటారు. ఈ లోకంలో ఆయనకు నువ్వు పొగొట్టుకుంటే ఆయనను ఎప్పటికి పొందలేవు. ఈ లోకం అశాశ్వతమైంది. నీవు తీసుకునే నిర్ణయం శాశ్వతమైందని మరచిపోకు.

లూర్దుస్వామి,
బెల్లంపల్లి



# పావన పసిబిడ్డల ఉత్సవం

## బాల వేదసాక్షులు
## (క్రీ॥శ॥ ఆరంభం)

ఒక పసిబిడ్డ మరణం ఒక ప్రత్యేకదు:ఖాన్ని కలిగిస్తుంది. అదే క్రూరంగా అమానుషంగా చంపబడితే ఊహించరానంత వ్యధ కలుగుతుంది. అంతరంగ లోతుల నుండి గుండె గుభేలుమంటుంది. ఒళ్లు జల దరిస్తుంది. కళ్లనీళ్లు పర్యంతమవుతుంది. నిస్సహాయులైన అమాయకులైన పసిపిల్లలను ఊచకోత కోయించి చంపిన ఉదంతం ఎంతో హృదయ విదారకంగా ఉంటుంది.

ప్రతిఏటా క్రీస్తు జయంతి తర్వాత మూడో రోజున డిసెంబరు 28వ తేదీన పావన పసిబిడ్డలను స్మరిస్తూ శ్రీసభ జపిస్తుంది. వీరంతా రెండేళ్ల లోపువారే. యూదుల రాజు అయిన బాలయేసు జన్మించారని తెలుసుకున్న హేరోదు రాజు ఆ బాలుని హత మార్చడానికి విశ్వప్రయత్నం చేశాడు. అయితే దేవదూత ద్వారా హేరోదు కుత్సిత తలంపును తెలుసుకున్న మరియ యోసేపులు దివ్యబాలుని తీసికొని తాత్కాలికంగా ఈజిప్టు దేశానికి వలసపోయారు. దర్శించి వస్తామన్న ముగ్గురు జ్ఞానులు తిరిగి రాకపోయే సరికి హేరోదు రాజు అగ్గి మీద గుగ్గిలమయ్యాడు. తాను, తన వారసులే రాజులుగాని వేరొక యూదుల రాజు ఉండకూడదు, అసలు పుట్టనే కూడదని ఆయన సంకల్పం. స్వార్థం, పదవీకాంక్ష, భోగలాలసత్వం, అహంకారం, పొగరు అలాంటివి.

అందుకే కోపోద్రిక్తుడైన హేరోదు రాజు బెత్లేహేము, దాని పరిసర గ్రామాల్లో ఉండే రెండేండ్ల లోపు మగ పిల్లలందరిని హతమార్చమని ఉత్తరువు జారీ చేశాడు. పూర్వవేదంలో అనేక వందల సంవత్సరాలకు పూర్వమే యిర్మియా ప్రవక్త పలికిన ప్రవచనం ఇలా నెరవేరింది (మత్తయి 2:16-18) అయితే ఎంతమంది మగ శిశువులు ఆ దారుణ మారణ హోమంలో కత్తికి బలి అయ్యింది. కచ్చితంగా తెలియకపోయినా, చిన్న గ్రామమైన బెత్లేహేములో కనీసం ఇరవై అయిదుమంది అమాయక పసికందుల్ని రాజు భటులు చంపి ఉండవచ్చని ఆధునిక పండితులు అభిప్రాయపడుతున్నారు. హేరోదు రాజు అభం శుభం తెలియని బోసినవ్వుల శిశువులను హతమార్చడం కంటే కూడా మహాఘోర క్రూర కృత్యాలు అనేకం చేయడం వల్ల ఈ అమాయక బాలల హత్యకాండ పాపానికి వెనుకాడలేదని తెలుస్తోంది. ఇలా హేరోదు రాజు భుజాలు తడుముకున్న దొంగలా తనను తాను దిగజార్చు కున్నాడు.

అయితే ఈ రక్తపాతం అంతటితో అంతం కాలేదు. దీనికి ప్రతిస్పందన ఉంది. అసలు మోక్షం పొందాలంటే రెండే రెండు మార్గాలున్నాయి. ఒకటి పవిత్రతతో రెండోది పశ్చాత్తాపంతో. ఈ పసిపిల్లలు తమ పవిత్రతో ప్రభు సాక్షులయ్యారు. అందుకే శ్రీసభ ఈ పావన పసి బిడ్డను యదార్ధమైన వేద సాక్షులుగా గౌరవిస్తుంది. ఎందుకంటే, వాళ్లందరూ తమకు తెలియకున్నా కేవలం క్రీస్తుకోసమే కాకుండా, క్రీస్తు తరపున తమ ప్రాణాల్ని అర్పించారు. తమ ప్రేమ, ముద్దుబిడ్డల్ని పోగొట్టుకున్న ఆ వ్యాకుల మాతృమూర్తులపట్ల సానుభూతిని వ్యక్తం చేస్తూ తమ అసాధారణ వ్యధచే వారునూ మోక్షపాత్రులవటం చేసి శ్రీసభ ఈ ఉత్సవం ఏర్పాటు చేసింది. ఆనాటి బలిపూజకు ఎరుపు వస్త్రాన్ని శ్రీసభ ఏర్పాటు చేసింది. గుడిలో పాటలుపాడే, వత్తాసు చేసే బాలల బృందానికి ఈ పవిత్ర బాలవేదసాక్షులనే పాలక పునీతులుగా శ్రీసభ ప్రకటించింది.

ఈ పండుగ సందర్భంగా ఒక విషయం తెలుసుకుందాం. ఇప్పుడు మనం పాటిస్తున్న గ్రెగోరియన్ కేలెండరు సూర్యమాసం బట్టి తయారు చేసింది. దీని ప్రకారం యేసు ప్రభు క్రీ॥పూ॥ 6లో జన్మించారు. మరో రెండేండ్లకు అనగా క్రీ॥పూ॥ 4లో పావన పసిబిడ్డల హత్యోదంతం జరిగిందని చెప్పవచ్చును. క్రీ॥శ॥ '0'లో బాలయేసు ప్రాయం 6 సం॥లుగా గ్రహింపనగును. ఖగోళశాస్త్రీయతను బట్టి క్రీస్తుశకం కేలెండరు ఇలా తయారుకాబడింది.

**ధ్యానాంశం :–**

నీ సకల కార్యాల్లోను దేవుని రాజ్యానికి
ఆయన మహిమకు ప్రథమ స్థానాన్ని ఇవ్వు.
పరోపకారంలో స్థిరంగా ఉండు. నీవు ఇతరులకు
ప్రబోధించుదామని ఆశించే వాటిని మొదటగా
నీవు ఆచరించు (పునీత బెర్నార్డీను)

## శుభవచనం బైబిల్ క్విజ్‌లో పాల్గొనే వారందరికి శుభవార్త

2022 బైబిల్ క్విజ్ సిరీస్‌ను మనం పూర్తి చేసుకున్నాము. ఇక ఫిబ్రవరి నెల నుండి క్రొత్త సిరీస్‌ను ప్రారంభిస్తున్నాము.

1. ప్రతి నెల అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి నెల చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి.

2. ప్రతి నెల క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేరు మరియు మార్కులు వ్రాసి ఉంచుతాము. ఇలా అన్ని నెలలు క్రమం తప్పకుండా అన్ని సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి నుండి సంవత్సరం చివరిలో లాటరీ తీసి దానిలో విజేతలకు బహుమతులు ఇవ్వబడుతాయి. మొదటి బహుమతి రూ॥ 10,000/–లు, రెండవ బహుమతి రూ॥ 8,000/–లు, మూడవ బహుమతి రూ. 6,000/– సంవత్సరములోని అన్ని పరీక్షలలో పాల్గొన్నవారికి ప్రోత్సహక బహుమతులు ఇవ్వబడుతాయి.

**మీరు ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నాము.**




(గత సంచిక తరువాయి భాగం)

అంజూరపు చెట్టు వాడిపోవుట నుండి యేసు శిష్యులకు విశ్వాసపు లోతులను కూడా వివరించాడు. విశ్వాసంలేక, నిర్వీర్యమైన, ఫలహీనమైన బలి అర్పణలకు, అర్చనలకు పరిమితమైన దేవాలయపు భక్తికి భిన్నంగా, యేసు పర్వతమును సహితం సముద్రమున పడవేయు విశ్వాసపు భాషను నేర్పిస్తున్నారు. ప్రార్థనలో విశ్వాసం అవసరం. దేవాలయంలో బలులుగ సమర్పించుటకు పావురములను, బలిపశువులను అమ్ముతుండేవారు. కానుకలుగా సమర్పించుటకు రూకలు మార్చబడేవి. యేసు వారందరిని వెడలగొట్టుట వలన ప్రార్థనారాధన వాటికంటె మిన్నయైనదని సూచించాడు. అదే విశ్వాసం. దేవునిముందు ప్రార్థనకు వచ్చునపుడు కావలసినది దేవుని యందు అచంచల విశ్వాసం, ప్రగాఢమైన నమ్మకం. అప్పుడు మనం ప్రార్థనలో ఏది అడిగనను ప్రసాదించబడును. అలాగనే మనం ప్రార్థనలో మనమర్పించవలసిన బలి మన సోదరులను క్షమించుట. అప్పుడే పరలోక తండ్రి మనలను కూడా మన్నించి, మనమడిగినది ప్రసాదించును. విశ్వాసంతో కూడిన ప్రార్థన మన జీవితంలో ఫలించును.

### 7.3 యేసు అధికారము 11:27-33

దేవాలయమున ప్రక్షాళన చేసిన తర్వాత ప్రధానార్చకులు, ధర్మశాస్త్ర బోధకులు, పెద్దలు యేసును అంతం చేయుటకు ప్రయత్నింపసాగారు. యూదులకు దేవాలయం చాలా పవిత్రమైనది. ఆ దేవాలయం ఆధారంగా యూదా సమాజం నిర్మితమైనది. అటువంటి

దేవాలయపు ఆధారమైన సమాజంలో ప్రధానార్చకులు, ధర్మశాస్త్ర బోధకులు, పెద్దలు, ప్రథములు. సామాన్య ప్రజలపై ఆధిపత్యం, అధికారం కలిగిఉన్నవారు. దేవాలయమును ప్రక్షాళనము చేయుట అనగా వారి ఆధిపత్యమును పరోక్షంగా సవాలు చేయుటయే. అందువలననే వారు యేసును అంతం చేయ ప్రయత్నింప సాగారు. వారి అధికారమును సవాలు చేసిన క్రీస్తు అధికారమును వారు ప్రశ్నించారు. అయితే యేసు తనను ప్రశ్నించిన ప్రతిసారి తెలివిగానే సమాధానమిచ్చారు. తన అధికారమును ప్రశ్నించిన వారికే ప్రశ్నను సంధిస్తున్నాడు. తనను ప్రశ్నించే వారిని సందిగ్ధంలో ఉంచే ప్రశ్నను సంధిస్తున్నారు. “బప్తిస్మ యోహాను అధికారము ఎక్కడ నుండి? మానవుల నుండియా? దేవుని నుండియా?” ఈ రెండు ప్రశ్నలలో దేనికి అవుననిన వారు ఇరుకున పడతారు. అందువలననే వారు తమకు తెలియదని సమాధానమిచ్చారు. ఇది వారిలోని అవిశ్వాసతను చాటుతుంది. ఈ అవిశ్వాసము యేసు చేసిన దేవాలయ ప్రక్షాళనము వారిలో కోపమును, శత్రుత్వమును కలిగించాయి. వారిలో విశ్వాసమున్నట్లైతే బప్తిస్మ యోహానును ప్రవక్తగా, మెస్సయా రాకను ప్రకటించువానిగా గుర్తించేవారు, యేసును మెస్సయాగా అంగీకరించేవారు. కాని వారిలోని అవిశ్వాసం వారిని అంధులను చేసింది. అనేకసార్లు మన అవిశ్వాసమే మనలను యేసు నుండి మన ప్రశ్నలకు సందేహాలకు సమాధానమివ్వకుండ అడ్డుపడుతుంది.

**7.4 భూస్వామి - కౌలుదార్లు ఉపమానం 12:2-12**

మార్కు సువార్తలో ఇది ఆఖరి ఉపమానం. ఈ ఉపమానం ద్వారా యేసు తనకు రానున్న శ్రమల సిలువ మరణం తెలియజేశాడు. ఉపమానంలోని ద్రాక్షతోట ఇస్రాయేలీ ప్రజలకు సూచకంగా ఉంది (యెషయా 5:1-7, యిర్మీయా 2:21). కౌలుదార్లు ఇస్రాయేలు మతాధికారులు. మీరు ప్రజలను దేవుని చిత్తాప్రకారం కాక, తమ స్వార్థం కోసం తప్పుదారిన నడిపిస్తున్నారు. సేవకులు యావే ప్రభువు పంపిన ప్రవక్తలు. ప్రజలను ప్రభువు మార్గంలో నడిపింప పంపబడిన ప్రవక్తలందరిని ఇస్రాయేలు మతాధికారులు హింసించారు. చంపారు. చివరన పంపబడిన కుమారుడు యేసు దేవుని కుమారుడు (యోహాను 3:16). అయితే అధికారులు ఈ దేవుని కుమారుని చంప ప్రయత్నిస్తున్నారు. చివరన సిలువలో చంపుతున్నారు. కాని తండ్రి కుమారునికి ఉత్థానం ప్రసాదించుట ద్వారా కౌలుదార్లను శిక్షిస్తున్నాడు. తిరస్కరింపబడినటు వంటి రాయియే మూలరాయి (కీర్తన 118:22-23) అయినది. ఆ రాయే యేసు. యేసు ఈ ఉపమానం చెప్పినపుడు యూద ప్రముఖులు దానిలోని ఆంతర్యము గ్రహించారు. కాబట్టి యేసును బంధింప దలచారు. వారు ప్రజలకు భయపడినారని మార్కు రాయుట ద్వారా సామాన్య ప్రజలలో యేసుకు ఆదరణ అభిమానం ఉన్నదని గమనించగలం. యేసును తుదముట్టించాలని ప్రయత్నిస్తున్నది అధికారులే కాని సామాన్య ప్రజానీకం కాదు. యేసునందు దేవుడు వ్యక్తం చేస్తున్న ప్రేమను, కృపను కూడా వారు తిరస్కరించారు. చివరికి వారే దేవుని తిరస్కారమునకు లోనయ్యారు. మనం కూడా దేవుని కృపను తిరస్కరించితే కోల్పోయేది మనమే.

# శుభవచనం బైబిల్ క్విజ్

యోహాను సువార్త 12-21 అధ్యాయాలు

పేరు ............................ఇంటి పేరు........................విచారణ ..............................

ఫోన్ నెంబర్...................................

**1. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి**

1) నా ........................................................... స్వీకరించి పాటించువాడే నన్ను ప్రేమిచువాడు.

2) అపుడు తోమా ...................................................................... అని పలికెను.

3) యేసు ఆ రసమును అందుకొని .......................................... అని తలవంచి ప్రాణము విడిచెను.

4) నేను నీ ....................................................................... వారికి అందజేసితిని.

5) వారు ............................................................... మనుష్యుల మెప్పునే ఎక్కువగా కాంక్షించిరి.

6) మీరు ........................................................................ నెలకొని ఉండుడు.

7) పేతురు ................................................................ అని బొంకెను. వెంటనే కోడి కూసెను.

8) నా ........................................................................... మీకు ఇచ్చుచున్నాను.

9) అపుడు ..................................... యేసుని పట్టుకొని .................................... కొట్టించెను.

10) పిమ్మట ..................................................................... తమ ఇంటికి తిరిగిపోయిరి.

11)............................................................................ అని యేసు వారిని పిలిచెను.

12) ఆమె ఆయన వంక తిరిగి హీబ్రూ భాషలో ................................................. అని పిలిచెను.

13) ........................................ అను బిరుదమును వ్రాయించి పిలాతు ఆయన సిలువపై పెట్టించెను.

14) యేసు ............................................. అని చెప్పగనే వారు వెనుకకు తగ్గి నేల మీద పడిపోయిరి.

15) నన్ను ............................................. నన్ను అనుసరింపవలెను. అప్పుడు నేను ఉన్న చోటుననే

నా ................................................. ఉండును.

16) నేనే మార్గమును, ................., ................., నా మూలమున తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాలేడు.

17) నేను మీకు ఒక నూతన ....................................................................... ఇచ్చుచున్నాను.

18) ఐనను నేను వెళ్లుట మీకు .................................................. మీతో నిజముగా చెప్పుచున్నాను.

19) అప్పుడు యేసు ప్రేమించిన శిష్యుడు ............................, ఆయన ............................ అనెను.

20) ఇతని సాక్ష్యము ................................................................ మనము ఎరగుదుము.

21) నీవు నా కొసగిన ................................................................. వారికి అందజేసితిని.

22) లోకము నన్ను .............................................................. యెడల మిమ్ములను హింసించును.

23) మీ .................................................................. పరిపూర్ణమగునట్లు మీరు పొందెదరు.

24) దాసుడు తన ................................................................... కంటె గొప్పవాడు కాదు.


25) యేసు వారితో మీ .................................... కలవరపడనీయకుడు. దేవుని ..............................
నన్నును విశ్వసింపుడు.

**శుభవచనం బైబిల్ క్విజ్ జవాబు పత్రాన్ని విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలో గానీ డిసెంబర్ నెల 25వ తేదీలోపు మాకు పంపించాలి.**

**వచ్చే నెల పాఠ్యాంశం: అపోస్తలుల కార్యములు 1-14 అధ్యాయాలు**

# ఇంద్రధనుస్సు

"నేడు దావీదు నగరమున మీకు ఒక రక్షకుడు పుట్టెను. ఆయన క్రీస్తు, ప్రభువు. శిశువు పొత్తిగుడ్డలలో చుట్టబడి పశువుల తొట్టిలో పరుండబెట్టబడి ఉండుట మీరు చూచెదరు. ఇదే మీకు ఆనవాలు" అనెను (లూకా 2,12). యేసు ప్రభుని పుట్టుకను తెలిపే ఈ చిత్రాన్ని రంగులమయం చేద్దాం.



**పేరు:.................................వయస్సు.......తరగతి.......స్థలం....................**

**సూచన :**

1. కేవలం 15 సం॥ల లోపు పిల్లలే ఈ పోటీలో పాల్గొనాలి.
2. రంగులు నింపిన చిత్రాన్ని మీ విచారణ గురువుల ద్వారా గానీ, పోస్టు రూపంలోగానీ డిసెంబర్ నెల 25 తేదీలోపు మాకు పంపించాలి.



# "ఆ వాక్కు మానవుడై మన మధ్య నివసించెను"

**(యోహాను 1,14)**

**ప్రియమైన చిన్ని బిడ్డలారా!**

మానవులకు అసాధ్యమైనవి, వారి ఊహా శక్తికి కూడ ఆనంద కార్యములను చూసినప్పుడు మనకు దేవుని శక్తి గోచరిమవుతుంది. ఎవరునూ ఎప్పుడునూ గాంచని అదృశ్యరూపుడైన దేవాధి దేవున్ని, వెలకట్టలేని ఆయన పవిత్ర ప్రేమను మానవజాతికి చూపించడానికి భువికి ఏతెంచిన దైవ కుమారుడు యేసుక్రీస్తు!

బైబిలులో యేసు ప్రభును గురించి, అతడు చేయబోవు కార్యాలను గురించి అతడు పుట్టడానికి అనేక వందల సంత్సరాల ముందే పరిశుద్ధ గ్రంథములో చెప్పబడింది. అదే మన దేవుని శక్తి. ఆయా కార్యాలను ప్రవచింప జేయించిన మన దేవునికి ఆ కార్యములపై అధికారము గలదు. వాటికి కర్త ఆయనే. కనుక అవి ఖచ్చితముగా నెరవేరుతాయి. ఈ కారణం చేతనే పరిశుద్ధ గ్రంథం మనకు మార్గదర్శి అని, భవిష్యత్ కార్యాలను ప్రవచన రూపంలో అందించిందని మన విశ్వాసం.

క్రీస్తు బేత్లెహేము పట్టణముందు పుడతాడని మీకా ప్రవక్త క్రీస్తు పుట్టుకకు 700 సం॥లకు పూర్వము, యేసుప్రభువుకు మార్గం సిద్ధం చేసిన బప్తిస్మమిచ్చు యోహానును గురించి మలాకీ ప్రవక్త ఆయన పుట్టుటకు 400 సం॥లకు పూర్వము, క్రీస్తు యెరూషలేము పట్టణానికి గాడిద పిల్లపై వచ్చునని, అతని స్నేహితుడు అతనిని 30 రూకలకు అమ్ముతాడని, ఆ ధనముతో కుమ్మరివాని పొలము కొంటారని యిర్మియా ప్రవక్త యేసుప్రభు పుట్టుకకు 800 సం॥ళ పూర్వమే ప్రవచించారు. యేసు ప్రభు వస్త్రముల కొరకు చీట్లు వేసుకుంటారని, న్యాయస్థానము నందు అతను మౌనముగా ఉంటాడని చెప్పబడినటువంటి ప్రవచనాలే కాకుండా ఒక్కరోజులోనే తన మరణం గురించి యేసు క్రీస్తు అనేక ప్రవచనాలను నెరవేర్చడం కూడ జరిగింది. అందుకే పరిశుద్ధ గ్రంథం దేవుడు మనకిచ్చిన సత్య వాక్కుగా మనం భావించాలి.

యేసుక్రీస్తు శరీర ధారియైన దేవుడు. పరము నుండి దిగివచ్చి మానవుల మధ్య నివసించాడు. గురిలేని మన జీవితములకు ఒక గురి కల్పించాలని, కలవరముతో శూన్యమైన మన దీన పరిస్థితి నుండి మనలను విడిపించాలని ఆయన సిలువ మీద మరణించారు. ఆయన సమాధి నుండి తిరిగి లేచి పరలోకమునకు వెళ్ళారు. మన జీవిత లక్ష్యమైన నిత్య జీవమును ఆయన మనకు అందించారు.

ఆ దివ్య బాలయేసుని దీవెనలు సదాకాలం మనపై ఉండునుగాక, ఆమెన్.



# క్రిస్మస్ అందాల పర్వదినం

ప్రపంచంలోని క్రైస్తవులంతా అత్యంత భక్తిశ్రద్ధలతో పారవశ్యంతో జరుపుకొనే పండుగ క్రిస్మస్. సత్య వాక్యమైయున్న దేవుడు రక్తమాంసాలతో జన్మించి పుడమిని పులకింప చేసిన సమయం. దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు హృదయాలలో మారు మ్రోగుతుంది. "యేసుక్రీస్తు ప్రభువు సమస్త మానవాళిని రక్షించుటకు మానవ ఆకారంలో ఈ లోకానికి ఏతెంచారు" క్రిస్మస్ అనే మాటకు క్రీస్తును ఆరాధించుట అని అర్థం.

ఆ ఆరాధన హృదయాంతరాళాల నుండి వెల్లుబడాలి. జగతి పరమార్థాన్ని గ్రహించి బతకాలన్నా, నిజమైన ఆనందాన్ని మదిలో నింపుకోవాలన్నా ఘనుడైన దేవుని ఆరాధించాలి. ఆదిసంభూతుడు, సర్వశక్తిమంతుడు, అత్యున్నతుడు, సర్వేశ్వరుడు, ఆరాధనకు యోగ్యుడు క్రీస్తే! కాలము పరిపూర్ణమైనపుడు ఆయన స్త్రీ యందు పుట్టి మనము స్వీకృత పుత్రులము కావలెనని ధర్మశాస్త్రమునకు లోబడియున్న వారిని విమోచించుటకు ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను అపోస్తలుడైన పౌలు ధన్యసత్యాన్ని గలతీ సంఘానికి తన పత్రిక రాస్తూ తెలియచేశాడు. పాపపంకిలమైన లోకంలో బతుకుచున్న మనలందరిని తన బిడ్డలుగా చేసుకోవాలన్నదే దేవుని నిత్య సంకల్పం. ఆ సంకల్పం నెరవేర్చడానికి యేసు క్రీస్తు ప్రభువు ఈ లోకంలో వచ్చారు.

దేవుడు అనుగ్రహించే సమాధానము విశిష్టమైనది. 'ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తజనులారా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతిని అనుగ్రహింతును' అని ప్రభువు సెలవిచ్చారు. ఆయన పాదాల చెంతకు వచ్చిన అనేకులను తన దివ్యశక్తితో, శాంతితో నింపి వారిని బలపరిచాడు. ప్రస్తుత కాలంలో మానవుడు శాంతి సంతోషాలను అనుభవించాలన్న ఆశతో అశాశ్వతమైన ఆనందాల కోసం వెంపర్లాడుతూ, మనుష్యులు లోకంలోని

బురదను అంటించుకొంటున్నారు. దానిని మురికిని వదిలించుకోలేక, విడిపించుకోలేక, కడుక్కోలేక సతమతమౌతున్నారు. రక్షించే నాథుడు ఎవరా? కాపాడే కరుణామయుడు ఉన్నారా? అని అలమటిస్తూ నిజమైన ఆనందం సమాధానం కోసం వెదకుతున్నారు.


నిజమైన ఆనందం డబ్బులో లేదు. పేరు ప్రఖ్యాతులు సంపాదించడంలో ఉండదు. భౌతిక సంబంధమైన భోగభాగ్యాలలో ఆనందం అనవాళ్ళు లభించవు కాని పరమాత్మునికి మనసులో చోటివ్వడం ద్వారా స్వచ్ఛమైన ఆనందాన్ని అనుభవించగలము. కనులు తెరిచి నిజమైన కాంతి అన్వేషిస్తే, హృదయాన్ని నిజమైన కాంతి కోసం అన్వేషిస్తే, హృదయాన్ని నిజమైన దేవునికి అర్పించి విలువైె ఆనందాన్ని స్వంతం చేసుకుంటే అంతకన్నా పరమార్థం వేరే ఉండదు. ఆ జన్మ ధన్యం పుట్టుక సఫలం. క్రిస్మస్ అవధులు ఆనందాన్నిచ్చింది. నిత్యనూతనమైన జీవాన్ని అందులో నింపింది. సర్వకాల సర్వావస్థలలోనూ తొణికిసలాడే సంతోషాన్ని నిండుగా నింపింది. మానవుడు విడుదల పొందనప్పుడ దేవుని ప్రసన్నతను అనుభవించగలడు, అనిర్వచనీయమైన సమాధానాలను పొందకొనగలడు.

పవిత్రుడు నిర్దోషి నిష్కల్మషుడైన దేవుడు మనుష్యాకారంలో ఈ లోకానికి దిగివచ్చి తన పవిత్రమైన రక్తాన్ని చిందించుట ద్వారా సర్వలోకానికి రక్షణ ప్రసాదించాడు. ఎవరైతే విశ్వాసంతో ఈ సత్యాన్ని దయతో విశ్వసించి హృదయంలో ఒప్పుకుంటారో యేసు రక్షకుడని వారందరూ రక్షింపబడతారు. పాపక్షమాపణ ఉచితంగా పొందుకుంటారు. పాపం ఎప్పుడైతే క్షమించబడిందో అప్పుడు సమాధానాలు మనిషి వశమౌతాయి. క్రిస్మస్ ఆచరించడమంటే ఎవరికి వారు ఆనందించడం కాదు. అనేకులకు ఆనందం పంచడం. కష్టాల్లో ఇబ్బందుల్లో ఉన్న వారికి ఆపన్న హస్తాన్ని అందించి, వారికి మనస్ఫూర్తిగా సహాయపడడం. త్యాగాన్ని ప్రేమను వేరువేరుగా మనం చూడలేము. నిరాశ, నిస్పృహలో ఉన్న వారిని భుజం తట్టి ప్రోత్సహించడం చేయగలిగితే క్రిస్మస్కు నిజమైన అర్థం ఉంటుంది.

| అక్టోబర్ నెల<br>శుభవచనం బైబిల్ క్విజ్ విజేతలు | అక్టోబర్ నెల<br>ఇంద్రధనుస్సు విజేతలు |
|---|---|
| మొదటి బహుమతి | మొదటి బహుమతి |
| ఎ. లావణ్య, రాంపూర్ | జోనాథన్, బెల్లంపల్లి |
| రెండవ బహుమతి | రెండవ బహుమతి |
| ఎమ్. సుందర్, ఇంద్రవెల్లి | కె. జాన్‌పాల్, నేరడిగొండ |
| మూడవ బహుమతి | మూడవ బహుమతి |
| సూర్యకాంత్, జన్నారం | ఎస్. ప్రణయ్ రాజ్, రాంపూర్ |
| బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి | బహుమతులు విచారణ గురువుల ద్వారా అందజేయబడుతాయి |

# బైబిల్ దృశ్యమాలిక


యెహోవా చేసిన ఘన కార్యాలను మరచిపోయరా?
ఆ కథలన్ని నమ్మితే మనకు అన్నం దొరుకుతుందా?
అమ్మా! నీవా యనను చూచావా? ఆ దేవుని కేమైన పండగ ఉందా
ఇశ్రాయేలు దేశంలో మనం ఏటేటా యెహోవా పండుగ చేసుకోమా?
దానిని పండుగ అంటారా?
రా పోదాం ఆలస్యం అవుతుంది.
వద్దు బాబు. పోవద్దు. మన దైవం యెహోవాను అవమానించవద్దు.
ఓర్పా రూతు త్వరగా తయారుకండి. మీరు నాట్యం చెయ్యాలి గదా?
అమ్మ! నువ్వు రాకూడదూ?


ఆ మూగ బొమ్మకు నమస్కరించ మంటావా?
మనం ఆమెను నిర్బంధించవద్దు. పోదాం పద రూతు.
నేను రావడం లేదు.
అత్తను ఇంటి దగ్గర ఒంటరిగా వదిలి పెట్టడం న్యాయం కాదు.
అంతగా విచారించకు రూతు. దేవుని సముఖంలో నువ్వు నాట్యం చేయాలి గదా!
ఆ రక్తం ప్రవహించేటపుడు నాకు కళ్లు తిరుగుతాయి.
ఎప్పటి నుండి?
నేను నీకు నయం చేస్తా
!?
ఆమెను వదిలి వెయ్యన్నా. అమ్మకు తోడుగా ఇంటి దగ్గరే ఉంటుంది.

# శుభవచనం బైబిల్ క్విజ్ జవాబులు

## యోహాను సువార్త 1-10 అధ్యాయాలు

1). మార్తమ్మను, లాజరును (11,5)

2). విశ్వసించినచో (11,40)

3). జీవము, జీవము (1,4)

4). అనుగ్రహింపబడిననే (3,27)

5). దేవుని మాటలను (8,47)

6). ఓలీవు (8,1)

7). నిత్యజీవమును (3,36)

8). ఆరాధించుచు, చిత్తమును (9,31)

9). దేవాలయమున (10,23)

10). అంధకారమున, జీవపు వెలుగును (8,12)

11). ఆహారము, పానము (6,55)

12). మనుష్యుల (5,41)

13). యేసు, మొదటి (2,11)

14). లోకమును (3,16)

15). మెస్సయా (4,25)

16). రెండవ (4,54)

17). విశ్రాంతి దినమున (5,16)

18). తండ్రి (5,19)

19). సూచనలు, మహత్కార్యములు (4,48)

20). ఒంటరిగ (6,15)

21). ఆహారమును (6,41)

22). దప్పిక (7,37)

23). నాద్వారా, రక్షణ (10,9)

24). అబ్రహాము (8,58)

25). యేసు (7,14)

**వచ్చే నెల పాఠ్యాంశం: అపోస్తలుల కార్యములు 1-14 అధ్యాయాలు**

# శుభాకాంక్షలు అందించండి



**జన్మదినం, వివాహము, వివాహ వార్షికోత్సవ, విచారణ పండుగలను పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేయాలనుకునేవారికి ఇదొక సదావకాశం. మీరు మీ ఫోటోను, ప్రచురించవలసిన వార్తను పంపించినట్లయితే మేము మీ తరుపున ఈ మాసపత్రికలో శుభాకాంక్షలు ప్రచురిస్తాము.**

బ్లాక్ & వైట్ ఫుల్ పేజీ రూ. 1000/-

బ్లాక్ & వైట్ ఆఫ్ పేజీ రూ. 500/-

బ్లాక్ & వైట్ క్వాటర్ పేజీ రూ. 250/-

ఈ సదావకాశమును వినియోగించుకొని మీ కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు తెలియజేయండి.

**వివరాలకు సంప్రదించండి**

9440874028

**రచయితలారా, గమనించండి ! వెంటనే రచనలు పంపండి!**

ఆధ్యాత్మిక స్ఫూర్తినిచ్చే రచనలు, కథానికలు, కవితలు, పిల్లల కథలు, మన విశ్వాసం గురించిన వివిధ అంశాలపై సామాజిక స్ఫూర్తినిచ్చే రచనలు వెంటనే పంపండి. **మీ రచనలు ప్రతినెల 12వ తేదిలోగా చేరాలి.** అలస్యంగా వచ్చే రచనలు పరిశీలింపబడవు.

**వివరాలకు సంప్రదించండి**

9398764408

**ఈ పత్రికను పొందాలనుకునే వారు మీ వివరాలు, అడ్రస్ మాకు పంపించండి**

**వార్షిక చందా 120 రూ॥లు**

**మా అడ్రస్**

**జీవస్వరం**

బిషప్స్ హౌస్, మంచిర్యాల - 504 208

మంచిర్యాల జిల్లా, తెలంగాణ

Cell : 9398764408, e-mail : jeevaswarammagazineadb@gmail.com